

# విభారె

## తెలుగు దినపత్రిక


## VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787


PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 26-04-2026 సంపుటి : 07 సంచిక 326 పేజీలు : 8 వెల : రూ 3-00

# సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్'.. అవార్డు

అమరావతి, ఏప్రిల్ 25 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముంబై వేదికగా ప్రతిష్టాత్మకమైన 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకున్నారు. ప్రముఖ ఆర్థిక దినపత్రిక 'ఎకనమిక్ టైమ్స్' సీఎం దార్శనికతకు, పాలనా సంస్కరణలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. పరిశ్రమల స్థాపన, మౌలిక సదుపాయాల కల్పన, సులభతర వాణిజ్యంలో చంద్రబాబు చూపుతున్న చొరవను కొనియాడుతూ ఎకనమిక్ టైమ్స్ ఈ అవార్డును అందించింది. దేశ ఆర్థిక అభివృద్ధిలో ఏపీని కీలక భాగస్వామిగా మలిచినందుకు సీఎంకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణం, పేదల సంక్షేమంపై ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదని, అది ప్రజా రాజధాని అని సీఎం అభివర్ణించారు. మరోసారి అమరావతిని నిర్మించే అవకాశం తనకు దక్కడం తన అదృష్టమని వ్యాఖ్యానించారు. నవ్యాంధ్ర నిర్మాణంలో అమరావతి ఒక ప్రపంచ స్థాయి ఐకాన్‌గా నిలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని, నిధుల పరంగా, మౌలిక సదుపాయాల పరంగా మద్దతు లభిస్తోందని వెల్లడించారు.పేదరికం






నిర్మూలన కోసం ఖ-4 విధానాన్ని తీసుకువచ్చామని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు, ప్రజలు కలిసి పేదల అభ్యున్నతికి కృషి చేయడమే ఈ ఖ-4 లక్ష్యమని వ్యాఖ్యానించారు. సంపదను సృష్టించి, ఆ సంపదను తిరిగి పేదల సంక్షేమానికి మళ్లించేలా ఈ విధానం ఉండబోతుందని సీఎం వివరించారు. ముంబై పర్యటనలో చంద్రబాబుకు లభించిన ఈ గౌరవం ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ఆకర్షణకు మరింత బలాన్ని చేకూర్చనుందని అధికారులు తెలిపారు. అమరావతిపై సీఎం వ్యక్తం చేసిన విశ్వాసం ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు.

# ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు ముహూర్తం ఫిక్స్..

## భారీ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం..



హైదరాబాద్, ఏప్రిల్ 25 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది. అలాగే ఇప్పటికే పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు కూడా ఉండే అవకాశముంది.ముఖ్యంగా ఓటూ ఖష్ట్రజీబవ 2ను జాతికి అంకితం చేసే అంశం ఈ పర్యటనలో ప్రధానంగా ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచే ఈ ప్రాజెక్ట్ ప్రజా ప్రయాణానికి కీలకంగా మారనుంది. ఎయిమ్స్ బీబీనగర్ ఆస్పత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి తెలంగాణతో పాటు సమీప రాష్ట్రాల ప్రజలకు కూడా వైద్యసేవల్లో పెద్ద మార్పు తీసుకురానుంది. ఇవే కాకుండా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారని సమాచారం.రవాణా, కనెక్టివిటీ రంగాల్లో ఈ ప్రాజెక్టులు కీలకమని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మరో అంశంగా మల్లారెడ్డి యూనివర్సిటీ పర్యటన కూడా ప్రధాని షెడ్యూల్‌లో ఉండొచ్చని చర్చ జరుగుతోంది. అయితే ఇది ఇంకా అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభాలు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ఆరోగ్య రంగంలో కొత్త సదుపాయాలపై కేంద్రీకృతమై ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రధాని అధికారిక షెడ్యూల్ పూర్తిగా ప్రకటించాల్సి ఉంది.

# అబద్ధాలు ప్రచారం చేయడంలో సజ్జలకు ఉన్న ప్రావీణ్యం దేశంలో ఎవరికీ లేదు: అచ్చెన్నాయుడు



అమరావతి, ఏప్రిల్ 25 : వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలు ప్రచారం చేయడంలో ఆయనకు ఉన్న ప్రావీణ్యం దేశంలో ఎవరికీ లేదని ఎద్దేవా చేశారు. ఈమేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అచ్చెన్నాయుడు ట్వీట్ పెట్టారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో అప్పుల భారంతో రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ధ్వజమెత్తారు. నేడు కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగలా మారుస్తోందని వ్యాఖ్యానించారు. తమ గణాంకాలు ప్రస్తావించామని.. దమ్ముంటే సమాధానం చెప్పాలని సజ్జలకు సవాల్ చేశారు.వైసీపీ వైఫల్యం వల్ల 2023-24లో 143 లక్షల మెట్రిక్ టన్నులకు ఆహార ధాన్యాల ఉత్పత్తి పడిపోయిందని అచ్చెన్నాయుడు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 237 లక్షల టన్నులకు పెంచి 51శాతం వృద్ధిని నమోదు చేసిందని ప్రస్తావించారు. ధరల స్థిరీకరణ నిధి (ఖూఈ) కింద కేటాయింపులు పెంచి, సుమారు రూ.588 కోట్లతో పొగాకు, మామిడి, ఉల్లి, కోకో రైతులకు నేరుగా లబ్ధి చేకూర్చామని వివరించారు. ఉల్లి రైతులకు గతంలో ఉన్న రూ.25 వేల నష్టపరిహారాన్ని హెక్టారుకు రూ.50 వేలకు పెంచి ఆదుకున్న ఘనత తమ కూటమి ప్రభుత్వానిదేనని చెప్పుకొచ్చారు.ప్రస్తుతం మొక్కజొన్న సమస్యపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో నిరంతరం చర్చిస్తూ రైతులకు అనుకూల నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. మైక్రో ఇరిగేషన్‌లో ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టామని చెప్పారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేసిన రూ.881 కోట్ల డ్రిప్, స్ప్రింక్లర్ బకాయిలను కూడా తామే చెల్లించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ మేరకు రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. ఆయిల్ పామ్ సాగులో ఏపీని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపి, ఉఎంను రూ.1.52 లక్షల కోట్లకు చేర్చామని వెల్లడించారు. వాస్తవాలు ఇలా ఉంటే, ఇంకా అబద్ధాలతో రైతులను మోసం చేయాలని చూస్తే ప్రజలే వైసీపీ నేతలకు తగిన బుద్ధి చెబుతారని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

# గూండాలకు జైలు లేకుంటే పైకి ... రాజ్‌నాథ్ హెచ్చరిక

హుగ్లీ: పశ్చిమబెంగాల్‌లో రెండో విడత ఎన్నికల ప్రచారం మరింత వేడెక్కుతోంది. రాష్ట్రం నుంచి గూండాలను ఏరివేసేందుకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కట్టుబడి ఉందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. 'గూండాలను జైలుకు లేకుంటే పైకి పంపిస్తాం' అని హెచ్చరించారు. హుగ్లీలో శనివారంనాడు జరిగిన రోడ్‌షోలో పశ్చిమబెంగాల్ ప్రజలకు ఎన్డీయే ఇచ్చిన హామీలను ప్రస్తావించారు. రైతుల, యువజన సంక్షేమం, మౌలిక వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టిసారిస్తామని అన్నారు.'బెంగాల్‌లో గూండాలకు చోటులేదని ఇంతకుముందు కూడా చెప్పాను. గూండాగిరి చేస్తే జైళ్లకు పంపుతాం. లేకంటే అంతకంటే తీవ్రపరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది. శాంతిభద్రతలను పటిష్టం చేస్తాం. రైతులకు గిట్టుబాటు ధరలు, యువతకు ఉపాధి, మంచి రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి చేపడతాం' అని చెప్పారు.'టీఎంసీ గూండాగిరి' పేరుతో బీజేపీ ఈసారి ఎన్నికల్లో విస్తృత ప్రచారం సాగిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం ఏప్రిల్ 19న జరిగిన ఎన్నికల ర్యాలీలో టీఎంసీ గూండాలు, సిండికేట్లు, అవినీతి శక్తులకు ఇదే చివరి ఛాన్స్ అని హెచ్చరించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల లోపు ఈశక్తులన్నీ లొంగిపోవాలని, లేదంటే మే 4వ తేదీ తర్వాత ఎవర్నీ విడిచిపెట్టే ప్రసక్తేలేదని అన్నారు. ఏప్రిల్ 29లోగా సమీపంలోని పోలీస్ స్టేషన్లలో లొంగిపోవాలని సూచించారు. బెంగాల్ అసెంబ్లీ రెండో విడత పోలింగ్ ఈనెల 29న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.






# ఏపీఎస్ఆర్టీసీకి 'పీఎస్‌ఈ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్' అవార్డ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు మరో జాతీయ అవార్డ్ లభించింది. సాంకేతిక వినియోగంలో విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా పీఎస్‌ఈ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్-2026 పురస్కారం దక్కింది. మెరుగైన ప్రజా రవాణా సహా డిజిటల్ సేవల్లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నందుకు గానూ ఈ అరుదైన గౌరవం పొందింది ఏపీఎస్ఆర్టీసీ. హైదరాబాద్‌లో జరిగిన ఇండియా పీఎస్‌ఈ సమ్మిట్‌లో ఈ అవార్డును సొంతం చేసుకుంది.రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకు ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఈ అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు సహా ఇతర అధికారులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందించారు. ఏపీఎస్ఆర్టీసీ ఇప్పటికే డిజిటల్ టికెటింగ్, కార్గో సేవల్లో జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. ఇది ఆర్టీసీ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి అని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.కాగా.. ఈ ఏడాది జనవరి 16న గవర్నెన్స్ నౌ - 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ ప్రదానోత్సవంలోనూ జాతీయ పురస్కారం పొందింది ఏపీఎస్ఆర్టీసీ. రాష్ట్ర వ్యాప్తంగా బస్టాండ్లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్(ంయా) ను విజయవంతంగా అమలు చేయడం ద్వారా ప్రయాణికులకు డిజిటల్ సేవలను అందించినందుకు గానూ అవార్డ్ దక్కింది. ఢిల్లీలో నాడు జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చీఫ్ ఇంజినీర్(ఐటీ) వై.శ్రీనివాసరావు పురస్కారాన్ని అందుకున్నారు.



# సంపాదకీయం

ఆదివారం 26-04-2026

## పాంచజన్యం పూరించిన కవిత !

కల్వకుంట్ల కవిత..ఈ పేరు పెద్దగా పరిచయం అక్కర్లేదు. తెలంగాణలో కవిత అంటే బతుకమ్మ అన్న స్థాయిలో ప్రాచుర్యం పొందారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా దివిటీ పట్టి వెలగించారు. తండ్రి కెసిఆర్ ఒడిలో రాజకీయ ఓనమాలు దిద్దుకున్న కవిత..ఇవాళ తండ్రి పార్టీని ధిక్కరించి.. తండ్రినే ఎదిరించి.. నిలదీసే స్థాయిలో..కొత్తగా పార్టీని ప్రకటించి పాంచజన్యం పూరించారు. ఒక్కరోజు తేడాలో పాత టిఆర్ఎస్ అవిర్భావ దినోత్సవం జరుగనుంది. దానికి రెండ్రోజుల ముందు కవిత తన పార్టీ కోసం ఎంచుకున్న తేదీ యాదృచ్ఛికం కాకపోయినా...ముహూర్త బలం ఉండేవుంటుంది. ఓ మహిళగా కవిత మహిళా లోకానికి బాగా తెలుసు. బతుకమ్మతో తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. తెలంగాణ ఉద్యమం లో మమేకం అయ్యారు. తెలంగాణ ఏర్పడితే అందరూ బాగుపడతారని నమ్మి అంతా కెసిఆర్ జెండా మోసారు. కానీ తెలంగాణ ఆగమయ్యింది. కెసిఆర్ కుటుంబం బాగుపడ్డది. అవినీతిలో ఆరితేరారు. లక్షల కోట్లు వెనకేసుకున్నారు. ఈ అవినీతి, తెలంగాణ ఆకాంక్షలను పక్కదారి పట్టించిన తీరుతోనే కెసిఆర్ పార్టీని ప్రజలు బొందపెట్టారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చాక ఉన్న పేగుబంధం కూడా తెగిపోయింది. బిఆర్ఎస్ అవినీతిని ఎదరించిన రేవంత్ రెడ్డి కూడా ఇప్పుడు అదే దారిలో ప్రయాణిస్తున్నారు. రెండున్న రేళ్లు కావస్తున్నా..ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక పని చేయలేదు. రేషన్ కార్డులు ఇచ్చాం..సన్న బియ్యం ఇచ్చాం..ఇదే పల్లవి. కానీ ప్రజల బాధ మరోలా ఉంది. ధాన్యం కొనడం లేదు. గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఉద్యోగాలు దక్కడం లేదు. అవినీతి పెరిగింది. పైసా ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. కిందిస్థాయి నుంచి మంత్రుల వరకు అవినీతి అంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పేదల ఇళ్లను కూల్చేస్తున్నారు. వెలుగమట్ల ఘటన ఒక్కటి చాలు..పేదలను ఎంతగా రాచి రంపాన పెట్టారో అర్థం చేసుకోవచ్చు. 50శాతం ఉన్న మహిళలు. 50 శాతం ఉన్న దళిత,గిరిజన, బహుజనులకు రాజ్యాధికారంలో చోటులేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ...తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భావం అన్నది ఒక అవసరం. ఆవశ్యకత కూడా ఉంది. ప్రజల పక్షాన పోరాడాల్సిన పార్టీ ఒకటి ఇప్పుడు తక్షణా వసరంగా ఉంది. ఎందుకంటే రాజకీయ పార్టీలన్నీ తమ సొంత ఎజెండాతో పనిచేస్తున్నాయి. సొంత వ్యవహారాల కోసం పనిచేస్తున్నాయి. అన్నింటికి మించి అవినీతి, ఆశ్రిత పక్షపాతంలో కూరుకుపోయాయి. కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి కూడా తెలంగాణకు చేసిందేమీ లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ఊదరగొట్టుడే తప్ప నిలబడి తెలంగాణ పురోగతికి చేసిందేమీ లేదు. నిత్యం విమర్శలు తప్ప మరో ఎజెండా దానికి లేదు. అందుకే గత ఏడాదిగా ప్రజల్లో తిరుగుతూ..వారి సమస్యలను వింటూ..సమస్యలపై పోరాడుతూ వస్తున్న కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. గతంలో ఓమారు పార్టీ పెడతామని ప్రకటించిన సమయంలో పార్టీ పేరు గురించి అడిగితే ..అప్రయత్నంగానే టిఆర్ఎస్ పేరు కూడా ఖాళీగా ఉందన్నారు. అయితే అంతా టిఆర్ఎస్ పేరును ఓన్ చేసుకుంటుందని భావించారు. కానీ తెలివిగా టిఆర్ఎస్‌నే ప్రకటించినా..తెలంగాణ రాష్ట్రసేనగా ప్రకటించి ఆశ్చర్య పరిచారు. ఇది ఓ రకంగా బిఆర్ఎస్ పార్టీకి ష్యాక్ లాంటిదే. టిఆర్ఎస్ పార్టీని పునరుద్దరించాలనుకున్న ఆ పార్టీకి ఇదో అశనిపాతం లాంటిదే .నిజానికి గత టిఆర్ఎస్‌లో ఉంటూ.. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్న కవిత మాటలు ముమ్మాటికీ నిజం. జాగృతి ద్వారా తెలంగాణ సాంస్కృతిక దీపాలను వెలిగించారు. తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నామంటే అందులో కవితనే కనిపిస్తారు. నిజానికి తెలంగాణ తెచ్చుకుంటే దరిద్రం పోతుందన్న భావనలో ఉండి పోరాడిన వారంతా ఆగమయ్యారు. ఆ కలలు నిజం కాలేదు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించిన వారంతా భంగపడ్డారు. పోరాటంలో ముందున్న కోదండరామ్ లాంటి వారు బయటకు తోయబడ్డారు. ఆయనే మరో పార్టీ పెట్టాల్సి వచ్చింది. కానీ ప్రజల మద్దతుల లేకపోవడంతో ఆయన ఇప్పుడు ఉనికి కోసం పాకులాడుతున్నారు. కాంగ్రెస్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించే శక్తి కూడా లేకుండా పోయింది. తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు బేడీలు పడ్డాయి.. లాఠీలు విరిగాయి. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం గుప్పిట్లో బతికారు. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బిక్కుబిక్కుమంటూ బతికింది. ఇవన్నీ కళ్లముందు కదలాడుతున్నాయి. బిఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా మార్పు రాలేదు. మార్పు తెచ్చామని, స్వేచ్ఛను ఇచ్చామని ప్రకటించుకున్నా..అది సాకారంకాలేదు. సామాజిక తెలంగాణ అన్నది నినాదంగా మారింది. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్న కవిత కష్టపడితే..ఆ పేరు సంపాదించుకోవచ్చు. కేవలం నినాదాల కోసం కాకుండా ప్రజలను అక్కున చేర్చుకునే అమ్మగా మారితే ప్రజలు బ్రహ్మరథం పడతారు. తెలంగాణ ప్రజలు నమ్మితే ప్రాణం ఇస్తారు. ఉద్యమకారులు పోరాడితేనే కొత్త రాష్ట్రం వచ్చింది. అది గుర్తించి కవిత అడుగుల వేయాల్సి ఉంటుంది. మాటలు చెప్పడం వేరు, అందుకు అనుగునంగా అడుగుల వేయడం వేరు. రాజకీయాల్లో చిరస్థాయిగా నిలవాలంటే నిబద్దత ముఖ్యం. నిజాయితీ అవసరం. నిలబడే ధైర్యం కావాలి. ప్రజలను ఆకట్టుకునే ప్రసంగాలే కాదు..పనులు చేసే ధైర్యం కనిపించాలి. కవిత ప్రకటించిన ఐదు సూత్రాలను ఆచరణలో పెడితే అద్భుతాలు సాధించవచ్చు. అందుకు కావాల్సిందల్లా ప్రజల పక్షాన పోరాడడం. ఎన్నికలకు మరో రెండేళ్లు గడువు ఉంది. మహిళా రిజర్వేషన్లు కూడా వస్తున్నాయి. మహిళలను, బడుగు బలహీనవర్గాలను రాజ్యాధికారంలో భాగం చేసేలా ప్రణాళికలు రచిస్తే కవిత తప్పకుండా విజయం సాధిస్తారు. రాజకీయ పార్టీగా ముందు నిలబడతారు. అవినీతి లేకుండా సాగుతారన్న నమ్మకం కూడా ముఖ్యం.

# మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్‌లను తిప్పికొడదాం’

## టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాలరావు

జూలూరుపాడు, ఏప్రిల్ 25 : చికాగో అమరవీరుల త్యాగఫలంతో సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని, మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్‌ల రద్దుకై కార్మిక వర్గం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టిజఅఎ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాలరావు పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడు మండల పరిధిలోని వెంగన్నపాలెం గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి 140వ మేడే ఉత్సవాల గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం చట్టాన్ని తుంగలో తొక్కి, కార్మికులను కట్టుబానిసలుగా మార్చేలా 12 గంటల పని విధానాన్ని తీసుకు రావాలని ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని, దీనివల్ల కార్మికులకు కనీస వేతనం అందకపోవడమే కాకుండా సమ్మె చేసే హక్కును, ప్రశ్నించే హక్కును కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.?దేశంలో ప్రశాంతంగా జీవిస్తున్న కార్మిక వర్గాన్ని కుల, మతాల పేరుతో విభజించి మనుషుల మధ్య తగాదాలు సృష్టించాలని చూస్తున్నారని, ఇలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు సంఘటితమై తిప్పికొట్టాలని ఆయన కోరారు. నియంతలా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు కార్మిక వర్గం ఏకతాటిపైకి రావాలని, వాడవాడలా 140వ మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని గోపాలరావు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో కార్మికులపై మోపే భారాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ప్రతి ఒక్కరూ ముందు వరుసలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వినోద్, నాగేష్, మధు, కనకమ్మ, అరుణ, లలిత, చందు, నాగయ్య, శ్రీదేవి, నరేష్, పద్మ, భవాని, నరసింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# చైనా తరహాలో.. ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేలో ‘నెయిల్ హౌస్’ ప్రతిఘటన

న్యూఢిల్లీ: చైనా తరహాలో ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేలో 'నెయిల్ హౌస్' ప్రతిఘటన ఎదురైంది. హైవే నిర్మాణం కోసం తన స్థలాన్ని ఇచ్చేందుకు ఒక యజమాని నిరాకరించాడు. ఈ వ్యవహారం కోర్టులో ఉండటంతో ఆ బిల్డింగ్ స్థలాన్ని వదిలేసి రోడ్డు నిర్మాణాన్ని కొనసాగించారు. ఢిల్లీ, డెహ్రాడూన్ మధ్య ప్రయాణ సమయాన్ని ఆరు గంటల నుంచి 2.5 గంటలు తగ్గించేందుకు 213 కిలోమీటర్ల మేర ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించారు. ఏప్రిల్ 14న ప్రధాని మోదీ ఈ ప్రాజెక్టును ప్రారంభించారు.కాగా, ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లోని మండోలా గ్రామం వద్ద ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వే మధ్యలో ఒక ఇల్లు అడ్డుగా ఉన్నది. ఆత్మగౌరవానికి చిహ్నంగా ఇది నిలిచింది. అయితే 1998 నుంచి ఈ ఇంటిపై భూ వివాదం కొనసాగుతున్నది. మండోలా హౌసింగ్ స్కీమ్ కోసం ఉత్తర ప్రదేశ్ హౌసింగ్ బోర్డ్ తన భూమిని స్వాధీనం చేసుకోవడాన్ని యజమాని అయిన దివంగత డాక్టర్ వీర్సేన్ సోరోహా నాడు అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేశారు. అధిక పరిహారాన్ని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఈ హౌసింగ్ స్కీమ్ పూర్తి కాలేదు.మరోవైపు 2020లో ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) భూ సేకరణ చేపట్టింది. ప్రస్తుతం సోరోహా మనవడు లక్ష్యవీర్ సోరోహా యాజమాన్యంలో ఉన్న ఆ భూమి సేకరణకు అధికారులు ప్రయత్నించగా అతడు నిరాకరించాడు.కాగా, తన ఇంటిని కూల్చివేసే ముప్పు ఉందని పేర్కొంటూ లక్ష్యవీర్ 2024లో సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. దీంతో ఎటువంటి కూల్చివేతలు లేదా తదుపరి నిర్మాణాలను చేపట్టరాదని, యథాతథ స్థితిని కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణను వేగవంతం చేయాలని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది.మరోవైపు కోర్టు వ్యవహారం నేపథ్యంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఆ ఇంటిని వదిలేసి నాలుగు వైపులా హైవే నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో హైవే మధ్యలో ఆ ఇల్లు ఒంటరిగా మిగిలింది. యజమాని నోయిడాలో నివసిస్తుండగా ఖాళీగా ఉన్నది. అక్కడ సెక్యూరిటీ గార్డు మాత్రమే ఉంటున్నాడు. ‘ఇల్లు ఎప్పుడూ ఖాళీగానే ఉంటుంది. నేను ప్రతిరోజూ దాన్ని శుభ్రం చేస్తాను. ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభమైన తర్వాత ట్రాఫిక్ శబ్దాలు భరించడం చాలా కష్టంగా ఉంది’ అని మీడియాతో అన్నాడు.అయితే చైనాలోని ‘నెయిల్ హౌస్’ ప్రతిఘటనను ఇది గుర్తు చేసింది. 2025లో తూర్పు చైనాలోని జియాంగ్జీ ప్రావిన్స్‌లోని జిన్సీ కౌంటీలో హైవే నిర్మాణం సందర్భంగా తన భూమిని ప్రభుత్వానికి ఇచ్చేందుకు ఒక ఇంటి యజమాని నిరాకరించాడు. ఈ నేపథ్యంలో ఆ ఇంటిని అలాగే వదిలేసి దాని చుట్టూ హైవేను నిర్మించారు. అయితే అధిక పరిహారం డిమాండ్ చేసిన ఆ ఇంటి యజమాని ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నాడు. నిరంతర ట్రాఫిక్ శబ్దాలతో అక్కడ నివసించలేకపోతున్నాడు. ఆ ఇంటిని అమ్ముకోలేక అక్కడ నివసించలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నాడు.



# అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఏప్రిల్ 25 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ఇచ్చిన ఏ ఒక్క హామీ పూర్తిగా నేరవేర్చడం లేదని దీంతో లబ్ధిదారుల్లో తీవ్రమైన నిరాశ కనబడుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అలాగే దివ్యాంగులకు త్రీ వీలర్ వెహికల్స్, అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు కేసీఆర్ ఇచ్చిన లక్ష తప్ప తులం బంగారం ఇంకెప్పుడిస్తారని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ విషయం గురించి మహిళల్లో తీవ్రంగా చర్చ జరుగుతుందని, ఆడపిల్ల పెండ్లికి తులం బంగారం త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారంటే అది కాంగ్రెస్ పాపమేనని, కార్మికుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వానిదే భాధ్యత అన్నారు.వడ్లు, మక్కల కొనుగోలు విషయంలోనూ జాప్యం సరికాదని జగదీశ్‌రెడ్డి అన్నారు. కొనుగోళ్లు అన్నీ కేంద్రాల్లో సజావుగా కొనసాగించాలన్నారు. మబ్బులు చూసి రైతుల గుండెల్లో గుబులు మొదలైతుంది. అకాల వర్షాలు పడకముందే కొనుగోలు సజావుగా పూర్తి చేయాలన్నారు. పేరుకే సెంటర్లు ప్రారంభిస్తున్నారు గానీ కొనుగోళ్లు మాత్రం చేయడం లేదన్నారు. దీంతో దళారుల చేతిలో రైతులు తీవ్రంగా మోసపోతున్నట్లు తెలిపారు. మళ్లీ పాత పద్ధతుల్లో దళారుల చేతుల్లో మోసపోయే దుస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ పాలన కంటే ముందున్న రోజులే మళ్లీ దాపురిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీళ్ల విషయాంలోనూ తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, విద్యుత్ కోతలు విపరీతంగా మొదలైనవని, ఇలా ఒకటి కాదు రెండు కాదు అన్ని రంగాల్లోనూ ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా మేలుకొని హామీల అమలుపై, అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని ఆయన హితవు పలికారు.




# యూఏఈ కీలక నిర్ణయం.. ఏఐతోనే 50 శాతం ప్రభుత్వ సేవలు..!



జంఇ : గల్ఫ్ దేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కీలక నిర్ణయం తీసుకుంది. 50 శాతం ప్రభుత్వ సేవలు, కార్యకలాపాలు ఏఐతోనే నడుస్తాయని ప్రకటించింది. ఏజెంటిక్ ఏఐ వినియోగాన్ని విస్తరించనున్నట్లు వెల్లడించింది. 2028 నాటికి ఈ మార్పులు తీసుకురానున్నట్లు యూఏఈ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మఖ్తుమ్ వెల్లడించారు. ప్రపంచంలోనే ఈ స్థాయిలో కృత్రిమ మేధ ను వినియోగించే తొలి దేశంగా యూఏఈ నిలవనుంది.ఇక్కడ ఏఐ ఓ సపోర్ట్ టూల్‌గా మాత్రమే కాకుండా ఒక ఎగ్జిక్యూటివ్ పార్ట్‌నర్‌గా మారనుందని యూఏఈ ప్రధాని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలను మెరుగుపర్చడానికి, నిర్ణయాలు తీసుకొనే ప్రక్రియను వేగవంతం చేయడానికి ఈ సాంకేతికతను ఉపయోగిస్తామని తెలిపారు. ఏజెంటిక్ ఏఐ అంటే.. ఇప్పటివరకూ ఉపయోగిస్తోన్న ఏఐ వ్యవస్థలు సాధారణంగా మనం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తాయి. కానీ ఏజెంటిక్ ఏఐ అంతటితో ఆగదు. ఒక లక్ష్యం ఇస్తే.. దాన్ని సాధించడానికి అవసరమైన దశలను తానే నిర్ణయించుకుని, అవసరమైన చర్యలు తీసుకుని, పని పూర్తయ్యేవరకు ముందుకుసాగుతుంది అంటే ఇది కేవలం ‘సమాధానం చెప్పే ఏఐ’ కాదు. ఇప్పటివరకూ ఏఐ ఒక సాధనంలా పనిచేసింది. మనకు అవసరం ఉంటే ఉపయోగించుకునేలా ఉండేది. కానీ ఇప్పుడు ఏజెంటిక్ ఏఐ మనతో కలిసి పనిచేసే సహచరుడిలా మారుతున్నది. ఇది అవసరాన్ని అర్థం చేసుకుని, అనేక దశల్లో పనిచేసి, కొంతవరకు నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకుంటోంది. కాగా ఇది చిన్న మార్పు కాదని, సహాయక టెక్నాలజీ నుంచి సహకార టెక్నాలజీకి ప్రయాణమని టెక్ నిపుణులు చెబుతున్నారు.

# పాముల ఆవాస కేంద్రంగా గౌతంపూర్ సబ్ స్టేషన్



రుద్రంపూర్, ఏప్రిల్ 25 : సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని గౌతంపూర్‌లో ఉన్న సబ్ స్టేషన్ పాముల ఆవాస కేంద్రంగా మారిందని అక్కడి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ పక్కన ఉన్న చెట్ల పొదల్లో నుండి తరచూ విష సర్పాలు బయటకు వస్తుండటంతో ఉద్యోగులు భయాందోళనల మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఉద్యోగులు తీసుకువచ్చిన టిఫిన్ బాక్సుల్లో కూడా పాములు కనిపించిన ఘటనలు ఉన్నట్లు వారు తెలిపారు. ఎప్పుడు, ఎటు నుండి పాము వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొనడంతో తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సబ్ స్టేషన్‌లోని మిషనరీ విభాగాల్లో కూడా పాములు ఆవాసాలు ఏర్పరుచుకుంటున్నాయని పేర్కొన్నారు.ఇటీవల రక్షణ వారోత్సవాలు నిర్వహించినప్పటికీ, ఇక్కడ కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోలేదని కార్మికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సబ్ స్టేషన్ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇలా చేస్తే చిత్తడి వాతావరణం తగ్గి పాముల సంచారం కూడా తగ్గే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.

# ‘ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి’

## వైద్యాధికారి డాక్టర్ రమ్య

ఆత్మకూర్, ఏప్రిల్ 25 : ఇల్లు, ఇంటి పరిసరాల్లో వారానికి ఒకసారి నీరు నిల్వ లేకుండా డ్రై డే పాటించాలని, దోమలు పెరగకుండా నియంత్రించాలని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రమ్య అన్నారు. అంతర్జాతీయ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆత్మకూర్ ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశం నుండి 2030 నాటికి మలేరియా అంతం చేయాలనే తపన ఇప్పుడు మనం చేయగలం అనే నినాదంతో ప్రజలలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.ఎవరైనా జ్వరం బారిన పడినట్లయితే ఆరోగ్య సిబ్బంది లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు నిర్వహించుకుని నిర్ధారణ అయితే మందులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి చెరుకు యాదగిరి, హెల్త్ సూపర్‌వైజర్ భూతరాజు సైదులు, మాణిక్య, నర్సింగ్ ఆఫీసర్ మానస, మహబూబా, హెల్త్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఉద్యోగాలకు ఎంపికైన శ్రీ బాలాజీ ఐటీఐ కళాశాల విద్యార్థులు..



వినుకొండ ఏప్రిల్ 25 ( శ్రీ బాలాజీ ఐ.టి.ఐ కళాశాల నందు శుక్రవారం నాడు ఒంగోలు లోని ఏ ఎం బి గ్రీన్ ఎనర్జీ కంపెనీ వారు నిర్వహించిన ఆన్ జాబ్ ట్రైనింగ్ ఇంటర్వ్యూ స్ కి శ్రీ బాలాజీ ఐ.టి.ఐ కాలేజీ లో సెకండ్ ఇయర్ చదువుతున్న 30 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని కాలేజీ ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ తెలియజేసారు. ఆన్ జాబ్ ట్రైనింగ్ ద్వారా కంపెనీ కి సెలెక్ట్ అయిన విద్యార్థులకు కంపెనీ వారు నెలకు 18000/- జీతం తో పాటుగా ఉచిత వసతి మరియు ఉచిత భోజన సౌకర్యాలు కల్పిస్తారని తెలియజేసారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధులుగా విచ్చేసిన బాపట్ల జిల్లా గవర్నమెంట్ కన్వీనర్ ఉమామహేశ్వరి దేవి మరియు మార్కాపురం జిల్లా గవర్నమెంట్ కన్వీనర్ లక్ష్మణ్ చేతులు మీదగా కంపెనీ కి ఎంపిక అయిన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం లో కాలేజీ డైరెక్టర్ సంకురాత్రి జానకి , ఆలిండియా రేడియో ఉద్యోగి సంకురాత్రి కోటేశ్వరరావు మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్న చీఫ్ విప్ జీవీ



బొల్లాపల్లి ఏప్రిల్ 25 స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. బొల్లాపల్లి మండలనీ లోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోగా, ఆయన వారితో నేరుగా మాట్లాడి వినతి పత్రాలను స్వీకరించారు. మౌలిక సదుపాయాల సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. జీవీ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల చెంతకు పాలనను చేర్చడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

నూజెండ్ల ఏప్రిల్ 25( )వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా నూజెండ్ల మండల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసు కోవాలని ఐనవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దీపికా మంజూష శనివారం తెలిపారు.



ఎండాకాలంలో వడదెబ్బ కి గురికాకుండా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలితే జ్వరం, తల నొప్పి, వాంతులు కావడం, తల తిరగడం, అలసట, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లటి ప్రదేశంలోకి తీసుకువచ్చి తడి గుడ్డతో తుడవాలి. చల్లని మజ్జిగ, కొబ్బరినీళ్లు, బార్లీనీళ్లు, సబ్జానీళ్లు, నిమ్మరసం వంటి ద్రావణాలు తాగించాలి. వడదెబ్బకు సంబంధించి సందేహాలు ఉంటే ఆశ వర్కర్, ఏఎన్ఎంలకు తెలియ జేయాలని మంజూష తెలిపారు.

# కొణికి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా 'స్కూల్ సంసిద్ధత' వేడుకలు

**చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల పంపిణీ**

**ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు పిలుపు**

ఇంకొల్లు, ఏప్రిల్ 25 చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే పునాదులని, వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అంగన్వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. శనివారం ఇంకొల్లు మండలంలోని కొణికి?2 అంగన్వాడీ కేంద్రంలో స్కూల్ సంసిద్ధత కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. అంగన్వాడీ ప్రీ-స్కూల్లో విద్యాభ్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న చిన్నారుల కోసం ప్రత్యేకంగా గ్రాడ్యుయేషన్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం, ఈ చిన్నారులందరినీ ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రోత్సహించారు. చిన్నారులు ఏడాది పొడవునా పూర్తి చేసిన పీపీ 1, పీపీ 2 వర్క్ బుక్స్, వారి ప్రగతిని వివరించే అసెస్మెంట్ కార్డులు వివిధ కృత్యాల ద్వారా పిల్లల్లో శారీరక, మానసిక మరియు మేధోపరమైన అభివృద్ధి ఏ విధంగా జరిగిందో ఈ సందర్భంగా వివరించారు. సిడిపిఓ ప్రత్యేక కానుకలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులందరికీ సిడిపిఓ గారి తరపున ప్రత్యేకంగా రూపొందించిన తో పాటు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు.

# ఉత్తమ వైద్యశాలలకు స్వచ్ఛ అవార్డులు

వినుకొండ ఏప్రిల్ 25 పట్టణంలోని ఉత్తమ వైద్యశాలలకు స్వచ్ఛ అవార్డులు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఛైర్పర్సన్ మరియు వెన్నెల నేత్రాలయం డాక్టర్ దస్తగిరి డాక్టర్ షకీలా దస్తగిరి ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దయానిధి శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ రాజేంద్ర సురేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ అన్నా మణికంఠ మరియు డాక్టర్ మృదుల తేజస్విని ని కమిషనర్ ఘనంగా సత్కరించారు. ముఖ్యంగా ఆసుపత్రులలో బయో మెడికల్ వ్యర్థాలను (Biomedical Waste) నిబంధనల ప్రకారం శాస్త్రీయంగా వేరు చేస్తూ, పారిశుద్ధ్య నిర్వహణలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందుకు గాను ఈ పురస్కారాలను అందజేశారు. పట్టణ ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ, సామాజిక బాధ్యతను చాటుకుంటున్న వైద్య బృందాలను కమిషనర్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. రోగులకు నాణ్యమైన వైద్యంతో పాటు ఆసుపత్రి ప్రాంగణాల్లో ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడంపై వైద్యశాలలు మరింత దృష్టి సారించాలని ఆయన కోరారు. వినుకొండను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంలో వైద్య ఆరోగ్య సంస్థల పాత్ర ఎంతో కీలకమని , భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో సేవలు అందించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ రమేష్, ఏఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్, జీ.జిల్లా కో ఆర్డినేటర్ ఎ ఐ ఐ ఎల్ ఎస్ జీ శివ పార్వతి మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, శానిటరీ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి సవితను కలిసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి 35 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి**

**రజకుల దోబీ ఘాట్కు నిధులు కోరిన జీవీ ఆంజనేయులు**

వినుకొండ ఏప్రిల్ 25 నియోజకవర్గ బీసీ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అమరావతిలోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినుకొండ పట్టణంలోని గంగినేని క్యాంపస్ ప్రైవేట్ భవనంలో నడుస్తున్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలకు (బాయ్స్) సొంత భవనం నిర్మించాలని కోరుతూ ఆయన వినతిపత్రం అందజేశారు. చెక్కవాగు వద్ద అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిలో 35 కోట్ల రూపాయలతో ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, వినుకొండ మున్సిపాలిటీ పరిధిలోని రజకుల సౌకర్యార్థం ఆధునిక దోబీ ఘాట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. గతంలో తన విజ్ఞప్తి మేరకు బొల్లాపల్లి మండలంలో బీసీ బాలుర హాస్టల్ మంజూరు చేసినందుకు గాను మంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, నియోజకవర్గంలోని బీసీల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.



# దళితులపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీ కి లేదు

**పళ్ళ మీసాల దాసయ్య ఫైర్**

వినుకొండ ఏప్రిల్ 25 ( వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దళితులపై జరిగిన అరాచకాలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని, ఇప్పుడు ఆ పార్టీ నేతలు దళిత ప్రేమను ఒలక బోయడం హాస్యాస్పదమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పళ్ళ మీసాల దాసయ్య విమర్శించారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసయ్య మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దాదాపు 56 వేల మంది దళితులపై దాడులు జరిగాయని, ఇది భారతదేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యధికమని పేర్కొన్నారు. అప్పుడు వైసీపీ పార్టీలోని దళిత నేతలు ఎక్కడికి వెళ్లారని, ఎందుకు నోరు విప్పలేదని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. జగన్ హయాంలో హోమ్ మంత్రిగా ఉన్న సుచరిత 'నేను హోమ్ మంత్రిగా ఉండి కూడా ఒక హోమ్ గార్డును మార్చలేని స్థితిలో ఉన్నాను' అని వాపోయారంటే, వైసీపీ ప్రభుత్వంలో దళిత నాయకులకి ఎంతటి ప్రాధాన్యత ఉందో అర్థమవుతుందని ఆయన ఎద్దేవా చేశారు. వినుకొండ వైసీపీలో ?స్థానిక నాయకత్వం విఫలమవ్వడం వల్లే వైసీపీ నేతలు ఎక్కడి నుంచో ఇతర ప్రాంతాల నాయకులను దిగుమతి చేసుకుని నిరాధారమైన విమర్శలు చేయిస్తున్నారని దాసయ్య మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే అట్టడుగు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని, స్పీకర్గా జి.ఎం.సి. బాలయోగి వంటి దళిత నేతలకు అత్యున్నత పదవులను కట్టబెట్టిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబులకే దక్కుతుందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఇద్దరు దళిత మహిళలను హోమ్ మంత్రులుగా చేసినా, వారికి కనీస అధికారం లేకుండా కేవలం 'రబ్బర్ స్టాంపుల్లా' వాడుకున్నారని ఆయన ఆరోపించారు. కానీ కూటమి ప్రభుత్వంలో అనిత కి పూర్తి స్వేచ్ఛతో పనిచేసే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ?కరోనా సమయంలో కనీసం మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్ను వీధికుక్కలా ఈడ్చుకెళ్లి ఆయన మృతికి కారణమైన ఘటన, మాజీ న్యాయ మూర్తులను, అనిత వంటి మహిళలను వేధించిన తీరు వైసీపీ అరాచక పాలనకు పరాకాష్ట అని దాసయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో పవన్ కుమార్, గుంటూరు జిల్లాలో కిరణ్ బాబు వంటి వారికి శిరోముండనం చేయించి అవమానించిన చరిత్ర వైసీపీదని, అటువంటి వారు ఇప్పుడు దళితుల హక్కుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ అరాచకాలను గుర్తించి ఇప్పటికే తగిన బుద్ధి చెప్పారని, ఇప్పటికైనా నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొమ్ముతోటి పౌల్, షనోము, పూండ్ల నరసింహారావు, నాసరయ్య, రాంబాబు, బర్మా, ప్రసాదు, కాలింగ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# నేరుగా దివ్యాంగుల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించిన..

**.సి.యం.సాయి కాంత్ వర్మ..**

గుంటూరు, ఏప్రిల్ 25 (: గుంటూరు మేము మీ వద్దకే వస్తాం అంటూ జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ నేరుగా దివ్యాంగుల వద్దకు వెళ్ళారు. శనివారం ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఎస్.సి, ఎస్ టి, దివ్యాంగులకు ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కు నేరుగా అర్జీలు సమర్పించాలని దివ్యాంగులు వచ్చారు. అయితే జిల్లా కలెక్టర్ అర్జీలు స్వీకరిస్తున్న ప్రదేశం వద్దకు వెళ్ళుటకు పరిస్థితులు అనుకూలించలేదు. దీనిని గమనించిన జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ మీకెందుకు ప్రయాసలు.. మేమే మీ వద్దకు వస్తాం అంటూ వెళ్లి, వారి ఆర్జీలను స్వీకరించడమే కాకుండా ఎంతో ప్రేమగా పలకరించారు. "మీరే స్వయంగా మా వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించడం మీ దర్శనికతకు నిదర్శనం" అంటూ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంలో దివ్యాంగులకు ఒక భవనం ఏర్పాటుకు కృషి చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళుటకు అచ్చట అనుకూలంగా ఉండే ర్యాంపులు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయాలని దివ్యాంగులు కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ అర్జీపై చర్యలు తీసుకుంటామని, అవకాశం మేరకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ప్రత్యేక పి.జి.ఆర్.ఎస్ లో ఎస్.సి, ఎస్ టి, దివ్యాంగులకు చెందిన అభ్యర్థులు తమకు సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని, ఉద్యోగం కల్పించాలని, వినికిడి ఉపకరణాలు పంపిణీ చేయాలని తదితర అంశాలపై అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారిఎన్.ఎస్.కె.ఖాజావలిడిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, జిల్లా విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ మలేరియా దినోత్సవం పై అవగాహన



నూజెండ్ల ఏప్రిల్ 25 (ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వినుకొండ సబ్ యూనిట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మలేరియా నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా వినుకొండ పట్టణంలోని ఎన్.ఎస్.పి కాలనీ యూపీహెచ్సీ హనుమాన్ నగర్ మరియు నూజెండ్ల, ముప్పాళ్ళ, కొచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పి హెచ్ సి పరిధిలో అధికారులు సిబ్బంది ప్రత్యేక ర్యాలీలు మరియు ప్రతిజ్ఞా కార్యక్రమాలను చేపట్టారుప్రధానాంశాలుఈ ఏడాది మలేరియా రహిత సమాజం దిశగా అడుగులు ఇప్పుడే మనం సాధించగలం అనే నినాదంతో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారుఈ కార్యక్రమాల్లో సంబంధిత ప్రాంతాల మెడికల్ ఆఫీసర్లు హెల్త్ సూపర్వైజర్లు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు మరియు సబ్ యూనిట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దోమతెరల వినియోగం మరియు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా మలేరియాను తరిమికొట్టవచ్చని ఈ సందర్భంగా వారు ప్రజలకు పిలుపునిచ్చారు.

# హస్తినాపురంలో వసతులు మెరుగుపరుస్తాం..

**మున్సిపల్ కమిషనర్ కె.శివరాం ప్రసాద్**



వినుకొండ ఏప్రిల్ 25 హస్తినాపురం గేటెడ్ కమ్యూనిటీని సందర్శించిన మున్సిపల్ కమిషనర్ కె.శివరాంప్రసాద్ ఇచ్చిన మాట ప్రకారం హస్తినాపురం లోని వసతులను మెరుగుపరచడానికి స్వయంగా గేటెడ్ కమ్యూనిటీ లోని 4 ప్రధాన రహదారులను పరిశీలించి వసతులను మెరుగుపరచటానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బెజవాడ వెంకట నాగేశ్వరావు గృహాన్ని, ఆర్థిక కార్యదర్శి లాం వెంకట్రావు గృహాన్ని మరియు గార్డెన్ ను సందర్శించి హస్తినాపురాన్ని చక్కగా అభివృద్ధి చేసుకుంటున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా హస్తినాపురం వాస్తవ్యులు అందరూ ఆయనకు ప్రత్యేక ధ[illegible]


# వైఎస్సార్సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళి ఆధ్వర్యంలో మొక్కజొన్న రైతు పోరాట దీక్ష..



గుంటూరు ఏప్రిల్ 25 ( జొన్న,మొక్కజొన్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర తక్షనమే కల్పించాలంటూ వైఎస్ ఆర్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళి రైతులు పక్షాన ఆందోళన చేపట్టారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట వున్నా ధర్నా చౌక్ వద్ద రైతు పోరాట దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసి రైతులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మొక్కజొన్న రైతులకు న్యాయం జరగకపోతే నిరసన ఉధృతం చేస్తామని ఆయన తెలియజేశారు.

# కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరిన గవర్నర్ అబ్దుల్ నజీర్..

తాడేపల్లి ఏప్రిల్ 25 శనివారం ఉదయం కడుపునొప్పితో మణిపాల్ ఆస్పత్రిలో చేరిన గవర్నర్ అబ్దుల్ నజీర్ వైద్య పరీక్షల్లో కిడ్నీలో రాళ్లు గుర్తించిన వైద్యులు.. శస్త్రచికిత్స ద్వారా తొలగించాలని చెప్పిన వైద్యులుఇవాళ ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నాయని.. మరోసారి ఆసుపత్రికి వస్తానని చెప్పి వెళ్లిపోయిన గవర్నర్



## సురేష్ మృతి పై కమిషనర్ సంతాపం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25:మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుడు సురేష్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గత 15 సంవత్సరాలుగా మున్సిపల్ శాఖలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేసిన సురేష్ సేవలు విశేషమని పేర్కొన్నారు.అనారోగ్య కారణాలతో శుక్రవారం కర్నూలు ఆసుపత్రిలో సురేష్ మృతి చెందినట్లు తెలిపారు. శనివారం నంద్యాలలోని ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్ ఈ గురప్పయాదవ్. డీఈలు. రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు వంకకు పునర్జీవం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25: జలధార?జలహారతి కార్యక్రమంలో భాగంగా గోస్పాడు మండలం సాంబవరం గ్రామంలోని తూర్పు వంక పూడికతీత పనులు చేపట్టి పునరుద్ధరించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశాల మేరకు సుమారు రూ.2.94 లక్షల వ్యయంతో ఈ పనులు కొనసాగుతున్నాయి.గాజులపల్లి అంకిరెడ్డి చెరువునుంచి ప్రారంభమై పలు గ్రామాల గుండా సాంబవరం కానాల చెరువులో కలిసే ఈ వంక పూడికతో నిండిపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయింది. ప్రస్తుతం సుమారు 1 కి.మీ మేర పూడికతీత పనులు చేపట్టడంతో నీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు మార్గం సుగమమైంది.ఉపాధి హామీ పథకం కింద నిర్వహిస్తున్న ఈ పనుల్లో గ్రామ కూలీలకు ఉపాధి లభిస్తోంది. కాలువ పునరుద్ధరణతో పొలాలకు వరద ముప్పు తగ్గడంతో పాటు చెరువులు నిండటం, భూగర్భ జలాల పెరుగుదల వంటి ప్రయోజనాలు కలుగనున్నాయి.రైతు డేవిడ్ క్రిస్టోఫర్ బాబు మాట్లాడుతూ, కాలువ శుభ్రపరచడంతో పొలాలు వరద నుంచి రక్షణ పొందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామీణ అభివృద్ధికి దోహదం చేస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## పూర్వ సైనిక్ పరిషత్ (వి.హెచ్.పి) ఆళ్లగడ్డ పట్టణ అధ్యక్షుడిగా శ్రీ వి. రామసుబ్బయ్య ఎన్నిక

విభారె న్యూస్::ఆళ్ళగడ్డ: ఆళ్లగడ్డ పట్టణ పూర్వ సైనిక్ పరిషత్ (ఎఊఖ) నూతన అధ్యక్షుడిగా రిటైర్డ్ సైనికోద్యోగి శ్రీ వి. రామసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి ఫంక్షన్ హాల్లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ నూతన కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



కార్యక్రమంలో బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ శ్రీ కమతం రాజశేఖర్ రెడ్డి . జిల్లా విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి. శ్రీ కిషోర్ కుమార్ ఆళ్లగడ్డ ప్రఖండ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి బజరంగ్ దళ్ జిల్లా సహ కార్యదర్శి ఈశ్వర ప్రసాద్ రెడ్డి, ఆళ్లగడ్డ ప్రఖండ కార్యదర్శి మురళి మరియు సభ్యులు డి.దేవేందర్ నాథ్ రెడ్డి, సి.రాందాస్, గోవిందరాజులు,ఆచారి,సి.వి.సుబ్బయ్య ఎం.ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ, హిందూ ధర్మ రక్షణకు మరియు సేవా కార్యక్రమాల విస్తరణకు పూర్వ సైనిక పరిషత్ నూతన కమిటీ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రామసుబ్బయ్య నియామకం పట్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు, మాజీ సైనికులు మరియు హిందూ బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామ సుబ్బయ్య గారు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని పేర్కొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ ఆళ్లగడ్డ పట్టణ అధ్యక్షుడిగా టంగుటూరి సత్యనారాయణ ఎంపిక

ఆళ్లగడ్డ: (విభారె న్యూస్): ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవా కార్యకర్త , ఆర్లగడ్డ పట్టణ ఆవోపా సంఘం అధ్యక్షులు శ్రీ టంగుటూరి సత్యనారాయణ విశ్వహిందూ పరిషత్ (ఎఊఖ) ఆళ్లగడ్డ



పట్టణ కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి ఫంక్షన్ హాల్లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ నూతన కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్,శ్రీ కమతం రాజశేఖర్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ కిషోర్ కుమార్, ఆళ్లగడ్డ ప్రఖండ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, బజరంగ్ దళ్ జిల్లా సహకార దర్శి ఈశ్వర ప్రసాద్ రెడ్డి, ఆళ్లగడ్డ ప్రఖండ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ, హిందూ ధర్మ రక్షణకు మరియు సేవా కార్యక్రమాల విస్తరణకు నూతన కమిటీ కృషి చేయాలని పిలుపునిచ్చారు. టంగుటూరి సత్యనారాయణ నియామకం పట్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు, వ్యాపార వర్గాలు మరియు హిందూ బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని పేర్కొన్నారు.

## గో రక్షా దళ్ (వి.హెచ్.పి) ఆళ్లగడ్డ పట్టణ అధ్యక్షుడిగా ఎం.బలరాం నియామకం


ఆళ్లగడ్డ (విభారె): ఆళ్లగడ్డ పట్టణ గో రక్షా దళ్ (విశ్వ హిందూ పరిషత్ ) నూతన అధ్యక్షుడిగా ఎం.బలరాం నియమితులయ్యారు. ఈ మేరకు పట్టణ కమిటీ సభ్యులు మరియు వి.హెచ్.పి ఉన్నతాధికారులు ఆయనను ఏకగ్రీవంగా తీర్మానించారు. పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి ఫంక్షన్ హాల్లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ నూతన కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి



విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ శ్రీ కమతం రాజశేఖర్ రెడ్డి గారు,జిల్లా విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి శ్రీ కిషోర్ కుమార్ గారు, ఆళ్లగడ్డ ప్రఖండ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, బజరంగ్ దళ్ జిల్లా సహ కార్యదర్శి ఈశ్వర ప్రసాద్ రెడ్డి, ఆళ్లగడ్డ ప్రఖండ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ, హిందూ ధర్మ రక్షణకు మరియు సేవా కార్యక్రమాల విస్తరణకు నూతన కమిటీ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలో గో సంరక్షణ ధ్యేయంగా, గోవుల అక్రమ రవాణా నిరోధానికి మరియు నిస్సహాయ స్థితిలో ఉన్న గోవులకు రక్షణ కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా బలరాం పేర్కొన్నారు. సనాతన ధర్మంలో గోమాతకు విశిష్ట స్థానం ఉందని, ప్రతి ఒక్కరూ గో సేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బలరాం నియామకం పట్ల స్థానిక హిందూ ధర్మ ప్రచారకులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో పట్టణ కమిటీని మరింత బలోపేతం చేసి, సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## చెత్త రహిత నంద్యాల లక్ష్యం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25:చెత్త రహిత నంద్యాల సాధనపై అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ నేపథ్యంలో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ, ఏప్రిల్ 25 నుంచి మే 25 వరకు కేంద్ర బృందాలు పర్యటించనున్నందున




ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.డ్రైనేజీలు, ప్రజా మరుగుదొడ్లు, పార్కులు, మైదానాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, ప్రతి మున్సిపాలిటీ ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత ర్యాంక్ కంటే మెరుగైన స్థానం సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఇంటింటి చెత్తను తడి?పొడి వేరు చేసి వాహనాలకు అందించాలని, రోడ్లు, కాలువల్లో వేయొద్దని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగంపై కఠిన నియంత్రణ అవసరమని, బ్రిడ్జిల వద్ద మెష్లు ఏర్పాటు చేసి చెత్త కాలువల్లో పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.స్వచ్ఛ సర్వేక్షణ్లో నంద్యాలకు మెరుగైన ర్యాంక్ లక్ష్యంగా ఇప్పటి నుంచే కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## దోమలు అంతం - ఆరోగ్య శాఖ పంతం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25: దోమలు అంతం ? ఆరోగ్య శాఖ పంతం అనే నినాదంతో శనివారం ఆరోగ్య శాఖ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఆర్. వెంకటరమణ, జిల్లా మలేరియా అధికారి నేతృత్వంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి సాయిబాబా నగర్ ఆర్చ్ వరకు సాగింది.మలేరియా వ్యాధి ఆడ అనాఫిలిన్ దోమ కాటుతో వ్యాపిస్తుందని అధికారులు తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్ష చేయించుకుని చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకుని దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలని సూచించారు.ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, ఎక్కడా నీరు నిల్వ ఉండనివ్వకపోవడం, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు. వేపాకు పొగ వలన కూడా దోమలను తగ్గించవచ్చని వివరించారు.కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, జిల్లా సహాయ మలేరియా అధికారి కె. సత్యనారాయణ, సిబ్బంది, ఎల్కేఆర్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా ప్రతిజ్ఞ చేశారు.

## ఆలయ భూమి స్వాధీనం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25-నంద్యాల జిల్లా, నంద్యాల మండలం మూలసాగరం గ్రామంలో శ్రీ మహానందీశ్వర స్వామి ఆలయానికి చెందిన సర్వే నెం. 974/1లోని 5.68 ఎకరాల భూమిని శనివారం ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని కార్యనిర్వహణాధికారి నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. భూమి మార్కెట్ విలువ ఎకరాకు సుమారు రూ.15 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. భూమికి సర్వే నిర్వహించి లీజుకు ఇవ్వడానికి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## రైతుల భూమి- పార్టీ ఆఫీసుకా..



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25-: నూనెపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్లోని విలువైన స్థలాన్ని టిడిపి కార్యాలయానికి కేటాయించాలనే ప్రతిపాదన జిల్లాలో తీవ్ర చర్చకు దారి తీసింది. రైతుల కోసం ఉద్దేశించిన భూమిని రాజకీయ అవసరాలకు వినియోగించాలన్న నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.జిల్లా టిడిపి అధ్యక్షుడు కోరిన మేరకు సుమారు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో, జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, చైర్మన్ హరిబాబు కలిసి స్థలాన్ని పరిశీలించారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జేడీ రామాంజనేయులు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. “ప్రస్తుతం ఆ స్థలం రైతులకు పెద్దగా ఉపయోగంలో లేదు. అందుకే లీజు ప్రాతిపదికన టిడిపి కార్యాలయానికి కేటాయించేందుకు ప్రతిపాదిస్తున్నాం” అని తెలిపారు.దీనిపై రైతు సంఘాలు మండిపడుతున్నాయి. భవిష్యత్తులో మార్కెట్ విస్తరణకు ఉపయోగపడే భూమిని రాజకీయ కార్యాలయాలకు ఇవ్వడం సరైన నిర్ణయం కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## డీజిల్-పెట్రోల్ సరఫరా సక్రమం--

### జిల్లాలో ఎలాంటి కొరత లేదు కలెక్టర్---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25-జిల్లాలో డీజిల్, పెట్రోల్ సరఫరా సక్రమంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ రాజకుమారి స్పష్టం చేశారు. సరఫరాపై వచ్చిన



వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనం తగిన మోతాదులో నిల్వలో ఉందని, ఎక్కడా కొరత లేదని తెలిపారు.సరఫరా వ్యవస్థను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, డిమాండ్కు అనుగుణంగా డీజిల్, పెట్రోల్ అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన చోట్ల అదనపు సరఫరా చర్యలు కూడా తీసుకుంటున్నారని తెలిపారు.వదంతుల కారణంగా అనవసరంగా నిల్వ చేసుకోవడం, బ్లాక్ మార్కెటింగ్కు ప్రయత్నించడం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, సాధారణ అవసరాల మేరకే ఇంధనం వినియోగించాలని సూచించారు.

## బడి పిలుస్తోంది వినూత్న ప్రచారం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25-నంద్యాల జిల్లా గడివేముల మండలం పెసరవాయి గ్రామంలో “బడి పిలుస్తోంది” కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు వినూత్నంగా నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి వీధిలో డ్రమ్స్, మైక్, ఆటోతో ప్రచారం చేపట్టి తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ప్రభుత్వ



పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, షూస్ వంటి సౌకర్యాలు పూర్తిగా ఉచితంగా లభిస్తాయని తెలియజేస్తూ, రాగయుక్తంగా అవగాహన కల్పించారు.విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామస్తుల దృష్టిని ఆకర్షించింది. కార్యక్రమంలో గడివేముల మండల విద్యాశాఖాధికారి సుబ్బరామిరెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ జ్యోతి, గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు రాజేశ్, పాపారావు, బాలాజీ సింగ్ పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**